ఘనంగా హరీశ్‌రావు పుట్టిన రోజు వేడుకలు

మెదక్ మున్సిపాలిటీ: హరీశ్‌రావు పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 3: ప్రజా శ్రేయస్సుకు నిరంతరం పాటుపడే నాయకుడు మాజీ మంత్రి హరీశ్‌రావు అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పుట్టిన రోజును పురస్కరించుకుని పార్టీ జిల్లా కార్యాలయంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్, వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, పార్టీ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు.

నర్సాపూర్: పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్ కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, జూన్ 3: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పుట్టిన రోజు వేడుకలు నర్సాపూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కేక్ కట్ చేసి హరీశ్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమోద్దీన్, బీఆర్ఎస్ నాయకుడు సత్యంగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు నాగరాజుగౌడ్, షేక్‌హుస్సేన్, సూరారం నర్సింహులు, బాల్‌రెడ్డి, రాంచందర్, ఆంజనేయులుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్: హరీశ్‌రావుతోపాటు కేసీఆర్‌ను కలిసిన మండలాధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాఘవేందర్ గౌడ్

శివ్వంపేట: హరీశ్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ హరికృష్ణ, మండలాధ్యక్షుడు రమణాగౌడ్, నాయకులు

చేగుంట: సిద్దిపేటలో హరీశ్‌రావుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకుడు నాయిని రాజ్‌గోపాల్, తదితరులు

టేక్మాల్: మాజీ మంత్రి హరీశ్‌రావు పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ మండల నాయకులు

ఇంకా ధాన్యం ఎన్ని రోజులు ఉంచాలి?

చిట్కుల్ కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

చిలిపిచెడ్, జూన్ 3: వర్షాలు కురుస్తున్నా కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని ఇంకా ఎన్ని రోజులు ఉంచాలి.. ఇప్పటికే వడ్లు మొతకెత్తుతున్నాయి.. అసలు మా ధాన్యం తీసుకుంటారా లేదా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. మొలకెత్తిన ధాన్యాన్ని చూస్తూ ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం పనికి రాకుండా పోతున్నదని దుఃఖిస్తున్నారు. చిలిపిచెడ్ మండలంలోని చిట్కుల్ గ్రామ పీఏసీఎస్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో నెల రోజుల నుంచి ధాన్యం కుప్పులుగా పోశారు. కాంటా కోసం వేచి చూస్తున్నారు. తూకం కావడం లేదని, లారీలు కూడా సరిగా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ధాన్యం రెండు సార్లు వర్షానికి తడిసిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తున్నాయని, వేగంగా కొంటేనే తమకు న్యాయం జరుగుతుందని, అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంలో సోమక్కపేట పీఏసీఎస్ సీఈవో పోచయ్యను వివరణ కోరగా మండలంలోని పీఏసీఎస్ పరిధిలో అన్ని సెంట్రర్లలో ధాన్యం కొనుగోలు పూర్తి చేస్తామని, చిట్కుల్‌లో ఎక్కువగా ధాన్యం ఉండడంతో ఈ రెండు రోజుల్లో కొంటామని తెలిపారు. ఇప్పటికే చిట్కుల్ కేంద్రంలోని ఆరు టీంల హమాలీలతో కాంటాలు పెట్టి లారీల్లో తరలిస్తున్నామన్నారు. ఏ ఒక్క రైతు కూడా ధాన్యం కోసం ఇబ్బంది పడొద్దని సూచించారు.

అమరుల త్యాగాలను స్మరించుకుందాం

- ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవం
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు ఘనంగా ఉత్సవాలు
- ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

బీఆర్ఎస్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాగౌడ్

అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, జడ్పీ చైర్మన్ హేమలత తదితరులు

మెదక్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ, అమరవీరుల స్థూపం, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో 14 ఏండ్లు పోరాడినట్లు గుర్తు చేశారు. ఉద్యమంలో 1200 మంది అమరులయ్యారన్నారు. ఎంతో మంది అమరవీరుల త్యాగం మరువలేమని, తెలంగాణ సమాజం కేసీఆర్ సీఎంగా ఉండాలని కోరుకున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ఒక్క పథకం అమలుచేయలేదన్నారు.

కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడం సంతోషం

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

తెలంగాణ సాధించిన కేసీఆర్ నాయకత్వంలో పని చేయడం సంతోషంగా ఉందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఒక్క వ్యక్తితో ఉద్యమం ప్రారంభమైందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి తెలంగాణ సాధించుకున్నామని తెలిపారు. తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీయే శ్రీరామ రక్ష అని, కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో నీళ్లు ఇచ్చామన్నారు. జిల్లాలో అనేక చెక్‌డ్యాంలు కట్టామని, కేసీఆర్ అడుగుజాడల్లో ఉంటూ ప్రజల సంక్షేమం కోసం ఉద్యమిస్తామన్నారు. కాంగ్రెస్ సర్కార్ 24 గంటల కరెంట్ ఇవ్వడంలో విఫలమయ్యిందన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, జడ్పీ ఉపాధ్యక్షురాలు లావణ్యారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున గౌడ్, పార్టీ పట్టణ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, మున్సిపల్ కౌన్సిలర్లు జయరాజ్, ఆర్‌కె శ్రీనివాస్, భీమరి కిశోర్, మాజీ కౌన్సిలర్ చంద్రకళ, హవేళీఘనాపూర్ ఎంపీపీ శేరి నారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జగపతి, గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట, జూన్ 3: తెలంగాణ కోసం అలుపెరుగని పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రం సాధించిన ఉద్యమ ప్రదాత కేసీఆరేనని పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు అన్నారు. సోమవారం బీఆర్ఎస్ జిల్లా కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు రామాయంపేట బస్టాండు వద్ద గులాబీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు పుట్టి యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం, చింతల ఏసుపాల్, భూమ మల్లేశం, చింతల రాములు, రాజు యాదవ్, ఎస్‌కే హైమద్, అస్నోద్దీన్, కన్నపురం కృష్ణాగౌడ్, పోచమ్మల ఐలయ్య, మ్యాథరి కిషన్, పాతూరి సిద్దిరాములు, విద్యాకర్‌రాజు, టంకరి స్వామి, గావు పరమేశ్, చింతల యాదగిరి, సరాఫ్ శ్యాంసుందర్ తదితరులు ఉన్నారు.

రామాయంపేట బస్టాండ్‌లో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాల, గురుకుల పాఠశాలలో లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు

బీవీఆర్ఐటీ కళాశాల

స్ట్రాంగ్‌రూమ్ వద్ద సిబ్బంది పహారా

నర్సాపూర్, జూన్ 3: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మెదక్ లోక్‌సభకు సంబంధించిన ఈవీఎంలు, వీవీప్యాట్లను నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాల, అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాలలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత కల్పించారు. ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగేందుకు జిల్లా అధికార యంత్రాంగంఅన్ని ఏర్పాట్లు చేసింది. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా రెండు చోట్ల భద్రపరిచారు. బీవీఆర్ఐటీ కళాశాలలో సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, మెదక్, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్లు లెక్కించనున్నారు. పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల ఓట్లను అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ బీవీఆర్ఐటీ కళాశాలలోని ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. మెదక్ 14 టేబుళ్లు, 20 రౌండ్లు, నర్సాపూర్ 14 టేబుళ్లు 22 రౌండ్లు, సిద్దిపేట్ 14 టేబుళ్లు 20 రౌండ్లు, దుబ్బాక 14 టేబుళ్లు 19 రౌండ్లు, గజ్వేల్ 15 టేబుళ్లు 22 రౌండ్లు, పటాన్‌చెరు 18 టేబుళ్లు 23 రౌండ్లు, సంగారెడ్డి 14 టేబుళ్లు 21 రౌండ్లు, పోస్టల్ బ్యాలెట్ 18 టేబుళ్లు 2 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగనున్నది. 650 మంది పోలీస్ సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ నేతృత్వంలో పది మంది డీఎస్పీలు, 15 మంది ఇన్‌స్పెక్టర్లు, 30 మంది ఎస్సైలు బందోబస్తులో పాల్గొననున్నారు. గుర్తింపు కార్డులున్న వారికే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని అధికారులు తెలిపారు. కౌంటింగ్‌కు వచ్చే అభ్యర్థుల ఏజెంట్లు, సిబ్బంది, అధికారులు, పోలీస్‌లతో పాటు ఇతర వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.

మోడల్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

రేగోడ్, జూన్ 3: మోడల్ స్కూల్ 6వ తరగతిలో ఎంపికైన విద్యార్థుల జాబిత విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ జయప్రకాశ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు కులం, ఆదాయం, నివాసం ధృవపత్రాలు, బోనఫైడ్, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు సమర్పించి అడ్మిషన్ తీసుకోవాలని పేర్కొన్నారు. ఎంపిక జాబితా మోడల్ స్కూల్ నోటీస్ బోర్డు, ఎంఆర్‌సీలో ఉందన్నారు.

సాయిబాబా ఆలయంలో చోరీకి యత్నం

వెల్దుర్తి, జూన్ 3: మాసాయిపేట 44వ జాతీయ రహదారి పక్కనున్న సాయిబాబా ఆలయంలో ఆదివారం కొందరు చోరీకి యత్నించారు. ఆలయ కమిటీ సభ్యుడు, మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ ప్రధాన తలుపు తాళాలు పగులగొట్టి లోనికి వెళ్లారు. ఆలయంలో ఎలాంటి వస్తువులు ఎత్తుకెళ్లలేదు. ఆలయంలో వెండి ఆభరణాలు, వస్తువులు, హుండీ ఉన్నాయి. ఈ విషయాన్ని చేగుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, కేసు నమోదు చేసుకున్నట్లు మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

భూ తగాదా.. కేసు నమోదు

శివ్వంపేట, జూన్ 3: భూమి తగాదాలో కేసు నమోదైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన బోను మాణెమ్మ భర్త రాములు, అదే గ్రామానికి చెందిన గుల్లయ్యగారి మధు ఇరు కుటుంబాలు 20 ఏండ్ల క్రితం ఒక బావిని కొన్నారు. ఆ బావి అర ఎకరం ఉంటుంది. ఆ బావిని పూడ్చితే భూమిని వాడుకోవచ్చని పదేండ్ల కిందట ఇద్దరు కలసి కొంతవరకు పూడ్చారు. వర్షం పడినప్పుడల్లా ఆ గుంతలో నీరు నిల్వ ఉంటున్నది. పూడ్చిన భూమిలో మధు సాగు చేసుకుంటున్నాడు. ఈ విషయంలో ఈ నెల 1న మధును మాణెమ్మ అడిగింది. మధు ఒక్కసారిగా బూతులు తిడుతూ కర్రతో కొట్టాడు. దీంతో మణెమ్మ తీవ్రంగా గాయపడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

మెదక్‌రూరల్ జూన్ 3: విద్యుత్ షాక్‌కు గురై ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజ్‌పల్లిలో సోమవారం జరిగింది. రాజ్‌పల్లికి చెందిన రైతు సున్నం వెంకటయ్య (46) తన పొలంలో బోరు మోటర్‌కు కరెంట్ సరాఫరా రాకపోవడంతో స్టార్టర్‌లో వైరుకు మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలి

చిన్నశంకరంపేట, జూన్ 3: రెండేండ్ల పైబడిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు శివకుమారి తెలిపారు. సోమవారం చిన్నశంకరంపేటలోని అంగన్‌వాడీ టీచర్ నాగరాణి పిల్లలతో ర్యాలీ నిర్వహించారు.

డీసీసీబీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

వెల్దుర్తిలో బ్రోచర్ విడుదల చేస్తున్న మేనేజర్, సొసైటీ అధ్యక్షులు, సభ్యులు

చేగుంట, జూన్3: డీసీసీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని చేగుంట మేనేజర్ శశికాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం చేగుంటలో బ్యాంకు సేవలకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మన్ వంటరి కొండల్‌రెడ్డి, చేగుంట చైర్మన్ రాములు, అరిగి సత్యనారాయణ, రఘురాములు, సీవోలు సంతోష్‌కుమార్, సంపత్ తదితరులున్నారు.

డీసీసీబీ సేవలు మరింత విస్తృతం

వెల్దుర్తి, జూన్ 3: నూతన స్కీంలతో డీసీసీబీ ఖాతాదారులకు మరిన్ని సేవలు అందిస్తున్నట్లు మేనేజర్ రవీందర్ తెలిపారు. నూతన స్కీంలు బ్రోచర్, వాల్‌పోస్టర్లను సొసైటీ అధ్యక్షుడు అనంతరెడ్డి, ఉపాధ్యక్షుడు మురళితో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు రమేశ్‌చందర్, హనుమంతరావు, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలి

అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ డాక్టర్ బాలస్వామి

- ఎస్పీ డాక్టర్ బాలస్వామి

మెదక్ అర్బన్, జూన్ 3: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ బాలస్వామి అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లికి చెందిన ముండ్రాతి సత్యనారాయణ సర్వే నెంబర్ 1146/31లో 20 గుంటల భూమి ఉన్నదని, ఆ భూమిలోకి తమ గ్రామానికే చెందిన కొందరు వ్యక్తులు రానియడం లేదని ఫిర్యాదు చేశాడు. ఇదేంటని అడిగితే భూమిలోకి వస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని తెలిపాడు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరాడు. ఫిర్యాదీకి తగిన న్యాయం చేయాలని చిన్నశంకరంపేట ఎస్సైకి ఆదేశించారు.

వివాహ వేడుకలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



వివాహ వేడుకలో పాల్గొన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు

చేగుంట, జూన్3: నార్సింగి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు రోమాల మంజులా రాజు కుమార్తె జయశ్రీ వివాహం స్థానిక చంద్రరెడ్డి గార్డెన్‌లో సోమవారం జరిగింది. ఈ వేడుకలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, నార్సింగి జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలారం బాబు, వైస్ ఎంపీపీ దొబ్బల సుజాతాశంకర్, ఆకుల మల్లేశంగౌడ్, నాయకులు మనోహర్‌రావు, ఆది లక్ష్మణ్, వెంకట్ నర్సింహారెడ్డి, భాషా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

కొత్తపల్లి బ్రిడ్జి వద్ద బీటీ రోడ్డు వేయాలి

మట్టిరోడ్డును బీట్‌గా మార్చాలని చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే

పాపన్నపేట్, జూన్3: మండలంలోని కొత్తపల్లి, యూసూఫ్‌పేట గ్రామాల మధ్య పూరాతన బ్రిడ్జి వద్ద బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి కోరారు. రోడ్డులో గుంతలు పడడంతో పెద్దశంకరంపేట్, రేగోడ్ టెక్మాల్, పాపన్నపేట మండలాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే బిటీ రోడ్డు నిర్మించేందుకు అధికారులు స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు

స్కూల్ విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ

ఫైజాబాద్ పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న హెచ్‌సీజీ నిర్వాహకులు

చిలిపిచెడ్, జూన్ 3: ఇంటర్నేషనల్ సైక్లింగ్ డేను పురస్కరించుకుని హెచ్‌సీజీ (హైదరాబాద్ సైకిళ్లు గ్రూపు) సభ్యులు 22 సైకిళ్లను సోమవారం అందజేసినట్లు హెచ్ఎం తారాసింగ్ తెలిపారు. మండలంలోని ఫైజాబాద్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అజ్జమర్రికి చెందిన 20 మంది విద్యార్థులు, ఫైజాబాద్ తండా నుంచి ఇద్దరు బాలికలకు సైకిళ్లను సంస్థ సభ్యులు సుభాష్, రవీందర్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ, శేఖర్, పాండురంగం, మాజీ సర్పంచ్ పరశురాంరెడ్డి, ఎంపీటీసీ మల్లయ్య పాల్గొన్నారు.

12 విద్యుత్ స్తంభాలు ధ్వంసం

శివ్వంపేట, జూన్ 3: ఆదివారం సాయంత్రం కురిసిన గాలివాన బీభత్సంతో మండలంలో 12 విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయని ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు. మండలంలోని చండి, శివ్వంపేట, గూడురు గ్రామాల్లో గాలివానకు విద్యుత్ స్తంభాలు ధ్వంసం కావడంతో పాటు చెట్లు కూడా విరిగిపడ్డాయన్నారు. తమ సిబ్బందితో అన్ని స్తంభాలను సరిచేసి, త్వరలోనే విద్యుత్ లైన్స్ క్లియర్ చేయనున్నట్లు ఏఈ తెలిపారు.

పరిస్థితి విషమించి బాలిక మృతి

- కన్నతండ్రి విషమిచ్చినట్లు ఆరోపణలు
- పోస్టుమార్టం అనంతరం పూర్తి వివరాలు

నిఖిత (ఫైల్)

వెల్దుర్తి, జూన్ 3: నాలుగు రోజులుగా దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాలిక మృతిచెందిన ఘటన వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శేరీ గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. ఎస్సై నవత, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరీల గ్రామానికి చెందిన ఇక్కిరి శ్రీశైలం, సౌందర్యలకు కూతురు నిఖిత(9) నాలుగు రోజుల క్రితం అస్వస్థతకు గురైంది. దీంతో నిఖితను చికిత్స కోసం ప్రైవేటు దవాఖానకు, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిలోఫర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం నిఖిత మృతి చెందింది. నాలుగు రోజుల క్రితం నిఖిత తండ్రి శ్రీశైలం కూల్‌డ్రింక్‌లో విషం కలిపి తాగించడంతోనే అనారోగ్యానికి గురైందని, ఆమె మృతికి కారణం తండ్రేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిఖిత తల్లి సౌందర్య ఇచ్చిన ఫిర్యాదులో శ్రీశైలంపై అనుమానం వ్యక్తం చేయడంతో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

మనోహరాబాద్, జూన్ 3: రోడ్డుపై ఆరబోసిన వడ్ల కుప్పను ఢీకొని తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మనోహరాబాద్ గ్రామానికి చెందిన యాదగిరి (40) దండుపల్లి మీదుగా గజ్వేల్‌కు ద్విచక్ర వాహనంపై ఈ నెల 27న బయలుదేరాడు. మార్గమధ్యలో రంగాయిపల్లి శివారులోని అగ్రహారం రోడ్డు వైపు వెళ్లాడు. రోడ్డు మధ్యలో ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా రంగాయిపల్లి గ్రామానికి చెందిన రైతు వడ్లను కుప్పగా పోశాడు. దీన్ని గమనించని యాదగిరి ఆ వడ్ల కుప్పను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో యాదగిరిని చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

ఇంటింటికీ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు

రామాయంపేట కేసీఆర్ కాలనీలో ఇంటింటికీ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు

రామాయంపేట, జూన్ 3: ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని, స్థానిక జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని ప్రభుత్వ అధ్యాపకులు ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ తిరిగి విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలలో చేర్పిస్తున్నారు. సోమవారం రామాయంపేటలోని కేసీఆర్ కాలనీ, రెడ్డికాలనీ, అక్కల బస్తీ, దుర్గమ్మ బస్తీల్లో అధ్యాపకులు యాదగిరి, స్వామి ఇంటింటికీ తిరిగి విద్యార్థులను జాయిన్ చేసుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. వివరాలకు సంప్ర: 8143366630 / 9989554915.
NT-334218

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327729-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.